క్లుప్తంగా

పండుగ ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్

ఆత్మకూరు: పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బక్రీద్ సందర్భంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న బక్రీద్ సందర్భంగా ఒకరినొకరు గౌరవించుకుంటూ పండగను జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కుర్బానీకి కేటాయించిన ప్రదేశంలో మాత్రమే చేసుకోవాలని చెప్పారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు సీఐ రాము, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పాములపాడు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో జీవిస్తే ప్రశాంత జీవనం సాగిస్తారని త్రైత సిద్ధాంత ప్రభోదా సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి, ఆత్మకూరు కమిటీల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని మిట్టకందాల, జూపాడుబంగ్లా మండలంలోని శంకరమలయ్య కొట్టాల, కనకయ్య కొట్టాల గ్రామాల్లో భగవద్గీత గ్రంథాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. భగవద్గీత పఠనం చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుమార్ ఆచారి, పుల్లారెడ్డి, నాగమద్దిలేటి, మనోహర్, భాస్కర్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్నిప్రమాదం



షెడ్డులో నుంచి చెలరేగుతున్న మంటలు

పాములపాడు: మండల కేంద్రంలోని మెకానిక్ షెడ్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షెడ్‌లో ఉన్న ఆయిల్ క్యాన్లు, బోల్టులు బిగించే బిట్లు, గ్రీస్ గన్, కంప్రెజర్ తో పాటు పలు సామాన్లు కాలిపోయాయి. సుమారు రూ.4లక్షలు ఆస్తి నష్టం సంభవించిందని షెడ్ యజమాని మహేష్ వాపోయాడు. షెడ్డు ఎవరైనా నిప్పంటించారా, ప్రమాదవశాత్తు జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం

పాములపాడు: బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించమని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. ఆదివారం రేషన్ దుకాణాల వద్ద పంపిణీని మండలంలోని బానుముక్కల, రుద్రవరం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఆర్ఐ ఖాజాబీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. పొరపాట్లకు తావుండకూడదన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో ఆదివారం షష్ఠిని పురస్కరించుకొని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

అలరించిన ప్రవచనాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై తెనాలికి చెందిన నోరి కోదండరాం శివ తత్త్వము - శివ వైభవంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త బాలరాజు

వెలుగోడు: రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి నేల ఆరోగ్యం పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంచుకోవాలని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త బాలరాజు సూచించారు. రేగడ గూడూరు, గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాల్లో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా యాగంటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీఏఆర్ చిరుధాన్య పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ విస్తరణ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు షురూ!

- ఇంటింటికీ వచ్చి రేషన్ అందజేసే విధానం రద్దు
- మళ్లీ చౌకదుకాణాల వద్ద నిరీక్షించాల్సిందే



సర్వర్ పనిచేయకపోవడంతో దుకాణం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



భుజంపై మోసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న మహిళలు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో ఎండీయూ వాహనం ఇంటి వద్దకు వచ్చి లబ్ధిదారులకు రేషన్ అందజేసేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే ఇంటింటికీ రేషన్ అందించే కార్యక్రమానికి మంగళం పాడడంతో మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంటికి దూరంలోనున్న రేషన్ దుకాణం వద్దకు వెళ్లి సురుకులు మోసుకొని వెళ్లేందుకు పలువురు మహిళలు ఆదివారం ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల సర్వర్ వేధించడంతో రేషన్ పంపిణీ నిలిచిపోవడంతో కార్డుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

ఎమ్మెల్యే ప్రారంభించే వరకు రేషన్ ఇవ్వం..

పట్టణంలోని షాపు నంబర్ 1311053 యజమాని జి.రాఘవేంద్ర ఉదయం షాపు 8:30 గంటలకు తెరిచారు. దుకాణం వద్దకు కార్డుదారులు రావడంతో.. డీలర్ మాట్లాడుతూ.. ఇప్పుడే ఇవ్వమని చెప్పారు. ఎందకని లబ్ధిదారులు ప్రశ్నించగా.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆత్మకూరులో షాపులను ప్రారంభించిన తరువాతనే తాము పంపిణీ చేపడతామని వారిని వెనక్కి పంపారు. అలాగే పట్టణంలోని కొత్తపేట మసీదు వద్ద 1311010 రేషన్‌షాపు యజమాని కరీముల్లా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వచ్చి ప్రారంభించిన అనంతరం బియ్యం వేస్తామని చెప్పారు. గంటలు గడిచినా ఎమ్మెల్యే రాకపోవడంతో కార్డుదారులు వెనుదిరిగారు. ఇలా పట్టణంలో చాలా రేషన్‌షాపులు రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఇవ్వకపోగా మరికొన్ని దుకాణాలు తలుపులు తీయలేదు. పట్టణంలో రంగ మహాల్ థియేటర్ వెనక వెంకటశివుడు రేషన్‌షాపు ఉదయం 9 గంటలైనా తెరవలేదు.

నాడు ఇంటి వద్దకు.... నేడు బరువు మోత

గత ప్రభుత్వంలో రేషన్ ఇంటి వద్దకు రావడంతో సులభంగా సరుకులు తీసుకెళ్లేవారు. ఇప్పుడు రేషన్‌షాపు వద్దకు వచ్చి రెండు నుంచి మూడు గంటల పాటు వేచి ఉండి బియ్యం మోసుకెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

మహానంది: కూటమి ప్రభుత్వం డీలర్ల వ్యవస్థను కొనసాగించడంతో లబ్ధిదారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఆదివారం పలు గ్రామాల్లో లబ్ధిదారులు డీలర్ల వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. ఎంసీ ఫారం గ్రామస్తులు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉన్న గాజులపల్లె ఆర్ఎస్‌కు, ఆంజనేయపురం గ్రామస్తులు గాజులపల్లెకు వెళ్లి తెచ్చుకోవడానికి అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలతో ఎంతో సౌకర్యంగా ఉండేదని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు.

సర్వర్ డౌన్..

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించిన రేషన్ దుకాణాల వద్ద రేషన్ సరుకులు తీసుకునే విధానంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు, వీఆర్వోలు, సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. గంట పాటు పనిచేసిన ఈ-పాస్ సర్వర్ తర్వాత నిలిచిపోవడంతో దుకాణాలను మూసివేశారు.

శ్రీశైలం ప్రాజెక్టు: కూటమి ప్రభుత్వం ఆదివారం నుంచి చౌకధరల డిపోల ద్వారా రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారు. కాగా తొలి రోజు దుకాణాల వద్ద సర్వర్లు పనిచేయకపోవడంతో కార్డుదారులు గంటల కొద్దీ నిరీక్షించారు.

ఇబ్బందులు పడుతున్నాం



చౌకదుకాణానికి వచ్చి రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి వద్ద పిల్లల్ని ఉంచి ఆ మూల నుంచి ఈ మూలకు నడుచుకుంటూ వచ్చి బియ్యం సంచి మోసుకెళ్లాలి. డీలర్ లేకపోతే రెండు సార్లు తిరగాలి. గత ప్రభుత్వంలాగానే వాహనాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేయాలి.

– లింగమ్మ, ఏకలవ్యనగర్, కార్డుదారు

కష్టాలు మొదలయ్యాయి



ముసలి వాళ్లం.. జగన్ ప్రభుత్వంలో ఇంటి దగ్గరికి వచ్చి రేషన్ ఇచ్చేవాళ్లు. నడవలేని మేము ప్రతిసారి డీలర్ల దగ్గరికి రాలేం. ఇలాంటివి ఎన్ని చూడాల్సి వస్తుందో.రానురాను పెన్షన్ కోసం కూడా ఎక్కడి రమ్మంటారో. మాకు మళ్లీ కష్టాలు మొదలైనట్లేనేమో.

– కొత్రపోలు మరియమ్మ, సున్నిపెంట



ఈ ఫొటోలో కనిపిస్తున్న పగిద్యాలకు చెందిన నాలుగేళ్ల చిన్నారి పేరు అర్షిత. వీరి రేషన్ కార్డులో నలుగురు సభ్యులు ఉన్నారు. బియ్యం వేయించుకోవడానికి వంతు కోసం కార్డు పెట్టమని తల్లిదండ్రులు రేషన్ షాపువద్దకు పంపారు. దుకాణం వద్ద జనం కిక్కిరిసి ఉండటంతో ఆ చిన్నారి బేల చూపులు చూస్తూ వంతుకు రేషన్‌కార్డును పెట్టి నిలుచుంది.







పాములపాడులో రేషన్ దుకాణం వద్ద బియ్యం కోసం క్యూలో నిల్చున్న కార్డు దారులు, తలుపులు తెరుచుకోని పగిద్యాల 26వ షాపు, జూపాడుబంగ్లాలోని 16వ రేషన్‌షాపు వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

మళ్లీ పడిగాపులే..



పగిద్యాలలో రేషన్ కోసం షాపు వద్ద వేచివున్న జనం

పగిద్యాల: కూటమి ప్రభుత్వం ఇంటింటికి బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనాలకు మంగళం పాడింది. ఆదివారం చౌకదుకాణాల వద్ద బియ్యం పంపిణీ ప్రారంభించింది. అయితే ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సిన బియ్యం పంపిణీని డీలర్లు ఇష్టానుసారంగా మధ్యాహ్నం, సాయంత్రం పూటల్లో ప్రారంభించడంతో వినియోగదారులు అష్టకష్టాలు పడ్డారు. పగిద్యాలలోని 3వ షాపు సాయంత్రం 4 గంటల నుంచి తెరుచుకోగా, 26వ షాపు అసలు తలుపులు తెరుచుకోలేదు. 3వ దుకాణం బయట స్టాక్ బోర్డు ఏర్పాటు చేయలేదు. 26వ షాపు వద్ద స్టాక్ బోర్డు బయట కిటికీ కట్టిన అందులో స్టాక్ వివరాలు ఏమి నమోదు కాలేదు. రేషన్‌కార్డులను క్యూలో పెట్టిన వినియోగదారులు రోడ్డు పొడవునా కూర్చుని అవస్థలు పడ్డారు. బియ్యం వేయించుకున్నా మూటలను ఇంటికి తీసుకెళ్లడానికి వినియోగదారులకు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం.

పాములపాడు: రేషన్ దుకాణాల వద్దకే వచ్చి ప్రజలు బియ్యం, నిత్యావసర సరుకులు తీసుకోవాల్సి రావడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాలుండటంతో మజరా గ్రామాల ప్రజలు కిలోమీటర్ల దూరం వచ్చి బియ్యం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అంతే కాకుండా రేషన్ దుకాణం వద్ద క్యూలో నిల్చోవాల్సింది.

రేషన్ పడిగాపులు ప్రారంభం

జూపాడుబంగ్లా: రేషన్‌సరుకుల పంపిణీ ఆదివారం నుంచి డీలర్ల ద్వారా ప్రారంభం కాగా మొదటి రోజే కార్డుదారులకు పడిగాపులు తప్పనిసరైంది. మండలం వ్యాప్తంగా 28 మంది డీలర్లు ఉండగా 11,247రేషన్‌కార్డులున్నారు. మొదటిరోజు లబ్ధిదారులు కార్డులు చేతపట్టుకొని డీలర్ల షాపుల వద్ద పడిగాపులు కాయసాగారు. కొంత మంది డీలర్లకు ఈపాస్ మిషన్‌ద్వారా రేషన్ సరుకుల పంపిణీ అలవాటు లేకపోవటంతో పంపిణీ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగింది. రేషన్‌సరుకులు తీసుకొన్న కార్డుదారులకు డీలర్లు స్లిప్ ఇవ్వాల్సి ఉండగా ఒక్క డీలరు కూడా కార్డుదారులకు స్లిప్పులు ఇవ్వకపోవటం గమనార్హం. మండలంలోని తాటిపాడు, భాస్కరాపురం, 80బన్నూరు గ్రామాల్లోని రేషన్‌డీలర్లకు రేషన్‌సరుకులు మంజూరు కాకపోవటంతో గత నెలలో మిగిలిన బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు.

ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని వామపక్షాల నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్ డిమాండ్ చేశారు. ఆదివారం మిడుతూరు మండలంలోని పీర్ సాహెబ్ పేట గ్రామంలో రచ్చబండ వద్ద ఎత్తిపోతల పథకంపై రైతులతో చర్చించారు. ఎత్తిపోతల పథకం సాధనకై కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మల్యాల ఎత్తిపోతల హంద్రీనీవా కాలువ నుంచి మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగు నీరు అందించాలన్నారు. అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో హామీలిచ్చి ఇప్పుడు ఊసే ఎత్తడం లేదన్నారు. రైతులందరూ కలిసి పార్టీలకు అతీతంగా లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్ఆర్‌బీసీ, ఎస్ఆర్ఎంసీ, అలగనూర్ రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగు, తాగు నీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు శ్రీనివాసులు, మత్రిస్వామి, ఏసన్న, స్వామన్న,, నరసింహులు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి బీమా సఖి



పాండురంగ నాయక్

వెలుగోడు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఎల్ఐసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా బీమా సఖి పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందులో మహిళలు ఏజెంట్లుగా చేరే అవకాశం ఉందని సంస్థ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎల్ఐసీ ప్రీమియం సెంటర్లో బీమా సఖి ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పాసైన మహిళలు ఎల్ఐసీలో బీమా సఖి ఏజెంట్లుగా చేరితే మొదటి సంవత్సరం ప్రతినెల రూ.7వేలు, రెండో సంవత్సరం ప్రతినెల రూ.6వేలు, మూడో సంవత్సరం ప్రతి నెల రూ.5వేల ప్రకారం సంస్థ స్టయిఫండ్ చెల్లిస్తుందన్నారు. ప్రతి నెల రెండు పాలసీలు చేయిస్తే వాటి కమీషన్‌తో పాటు స్టయిఫండ్ పొందవచ్చని వివరించారు. ఉచితంగా గ్రూప్ ఇన్సూరెన్స్ కూడా వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఆత్మకూరు ఎల్ఐసీ బ్రాంచ్‌లో సంప్రదించాలని కోరారు.

భక్తులు ఫుల్..వసతి గదులు నిల్!

- వసతిగృహాల కోసం భక్తుల అవస్థలు
- మూడింతలు అదనంగా వసూలు చేస్తున్న లాడ్జీల యజమానులు



మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: వేసవి సెలవులతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. మహానందీశ్వర స్వామిని దర్శించుకుని భక్తులు అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన వసతి గదులు తక్కువగా ఉండటంతో వసతి గృహాల కోసం భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. దేవస్థానం వసతి గృహాలు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీల యజమానులు భక్తులను దోపిడీ చేస్తున్నారు. సాధారణ రోజుల కంటే మూడింతల మొత్తం అధికంగా వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. కొన్ని లాడ్జీల నిర్వాహకులు ఏకంగా మా లాడ్జీల్లో వసతి గృహాలు తీసుకుంటే దర్శనం ఉచితంగా చేయిస్తామంటూ భక్తులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నట్లు సమాచారం. దీనికి ఆలయంలో పనిచేసే కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి భక్తులకు అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కురువల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి



శ్రీనివాసులును సత్కరిస్తున్న కురువలు

వెలుగోడు: కురువల ఆరాధ్య దైవం బీరప్ప స్వామి అని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. వేల్పనూరు గ్రామంలో కురువలు మూడు రోజులుగా బీరప్ప స్వామి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మహిళలు బోనాలతో గ్రామంలోని బొడ్రయి చుట్టూ తిరిగి బీరప్ప గద్దె మీదకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బీరడోళ్లను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం శ్రీనివాసులును కులస్తులు సత్కరించారు. సంఘం ప్రెసిడెంట్ మిడుతూరు పెద్ద పుల్లయ్య, పాలమారి పెద్ద బూషన్న, ఆకుల వెంకటరమణ సీమంత అంకన్న మల్లయ్య సుద్దల మద్దిలేటి పాల్గొన్నారు.

సంక్షిప్తం

హోరా హోరీగా క్రికెట్ టోర్నమెంటు

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 3 రోజులుగా సమ్మర్ స్పెషల్ క్రికెట్ టోర్నమెంటులో జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం ఎండ తీవ్రత తక్కువగా ఉన్నందున నిర్విరామంగా 3 మ్యాచ్‌లను నిర్వాహకులు కొనసాగించారు. సంత జూటూరు జట్టు పై కరివేన జట్టు, జూటూరు జట్టు పై క్రిష్ణారావుపేట, పాములపాడు జట్టు పై మిట్టకందాల జట్లు గెలుపొందాయి.

ప్రజా ప్రతినిధులంటే చులకనా..?

కొత్తపల్లి: రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు అంటే టీడీపీ నాయకులకు చులకనా...?అని నందికుంట గ్రామ సర్పంచు నిత్యలక్ష్మీదేవి ప్రశ్నించారు. ఆదివారం ఆమె సాక్షితో మాట్లాడారు. నందికుంట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు, టీడీపీ నాయకులు కలసి రేషన్ షాపును ప్రారంభించారన్నారు. ఆ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం సర్పంచునైన తనకు కనీసం అధికారులు సమాచారం ఇవ్వకుండా ఎటువంటి పదవులు లేని టీడీపీ నాయకులతో ప్రారంభించడం అధికార దుర్వినియోగం అవుతుందన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ

ఆత్మకూరు: స్థానిక పద్మావతి హైస్కూల్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం మెగా డీఎస్సీ ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహించారు. సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం మోడల్ పరీక్షలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. స్నేహ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆశాబీ, నూర్‌బాషా, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు నూర్‌మహమ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం, హుసేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

వెలుగోడు: గోవుల అక్రమ తరలింపును అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోతుల రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో గోవుల అక్రమ రవాణా జరుగుతూనే ఉందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రవాణా చేస్తున వారితో పాటు అమ్మిన వారు, కొన్నవారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఆ పార్టీ మండల కార్యదర్శి నూలు నాగేశ్వరరావు, నాయకులు తిరుపాలు నాయక్, మధు గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగలూటి క్రాస్ రోడ్డు నేషనల్ హైవేపై టిప్పర్ హల్‌చల్ చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాలు తెలిపిన మేరకు వివరాలు. వెలుగోడు మండలం అబ్దులాపురం గ్రామానికి ఎల్లాగౌడు, రహీమ్‌బాషా కార్ లైట్లు కొనుగోలు చేసేందుకు ఉదయం కర్నూలు వెళ్లారు. ఎల్లాగౌడుకు చెందిన కారుకు లైట్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తిరుగుపయణమయ్యారు. మార్గ మధ్యలో నాగలూటి క్రాస్ రోడ్డు సమీపంలో అవతల వైపున కర్నూలు వైపు వెళ్తున్న టిప్పర్ అకస్మాత్తుగా డివైడర్ క్రాస్ చేసి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. బైక్ నుజ్జునుజ్జు కాగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారు. వారిని 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎల్లాగౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణి రెడ్డి

బండి ఆత్మకూరు/మహానంది : గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి పాలనకు వ్యతిరేకంగా ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దిన్నం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం బండి ఆత్మకూరు, మహానంది మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో పాటు అమలు సాధ్యం కానీ హామీలను ప్రకటించి ప్రజలను దగా చేశారన్నారు. అధికారం చేపట్టిన అనంతరం హామీల అమలును పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వేధింపులే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. 4న కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీశైలం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఇటికెల చిన్న సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగలరమణ, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ రామయ్య, సర్పంచ్ ఆవులపాటి మధు, కో-ఆప్షన్ మెంబర్ జమాల్ బాషా, పార్టీ మహానంది మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వీధి వీధిన బెల్టుషాపులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ధ్వజమెత్తారు. వీధి వీధికి కూటమి నేతలు బెల్టుషాపులు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. మద్యం ఏరులైపారుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. కమీషన్ల కక్కుర్తి కోసం నేతలు పోటీ పడుతుండటం చూస్తే వారి ధన దాహం అర్థమవుతుందన్నారు.

సంగమేశ్వరంలో భక్తుల సందడి



దిగువ పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు



వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేమైన సప్తనది సంగమేశ్వరంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు సందడి చేశారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో భక్తులు లలితా సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎగువనుంచి శ్రీశైలం జలాశయానికి వరదనీరు ఎక్కువగా వస్తుంది. దీంతో దిగువ పుష్కరఘాట్‌ను కృష్ణాజలాలు తాకాయి. వచ్చిన భక్తులు ముందుగా కృష్ణాజలాలలో పుణ్యస్నానాలు చేసి, ఆలయ ఆవరణలోని దేవాతా మూర్తులవద్ద కాయ కర్పూరం సమర్పించి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా గర్భాలయంలోని వేపదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, కృష్ణాజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేషపూజా కార్యక్రమాలు చేసుకొని భక్తి పరావశ్యంతో పరశించిపోయారు.